క్లుప్తంగా

జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వైరా రోడ్డు జెడ్పీసెంటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవన యజమాని భవన నిర్మాణ మెటీరియల్‌తో పాటు వ్యర్థాలను రోడ్డుపైనే నిల్వ చేయడంతో కేఎంసీ అధికారులు గురువారం రూ.10 వేల జరిమానా విధించారు. వాహనదారులు ఇబ్బంది పడేలా వ్యర్థాలను రోడ్డుపై పడేయొద్దని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ఎస్‌ఐలు, జవాన్లు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కామేపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా మందిర 28వ వార్షికోత్సవ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు పంచామృత అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. మందిర చైర్మన్ యర్రా నాగార్జునరావు, లక్ష్మి, పుల్లయ్య, పూజారి రాకేశ్‌శర్మ, మురళిసాయి, స్థానికులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గురువారం మండలంలోని శంకరగిరితండాకు చెందిన లక్ష్మి (45) పాయిజన్ తీసుకుని, నేలకొండపల్లికి చెందిన ఉమమాహేశ్వరీ (38) టాబ్లెట్ వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఇద్దరి మహిళల ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సమీపాన కొక్కిరేణి స్టేజీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుమలాయపాలెంకు చెందిన గ్రామీణ వైద్యుడు రేగళ్ల రామారావు, కొక్కిరేణికి చెందిన దొడ్డి రామారావు కలిసి బైక్‌పై ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా కొక్కిరేణి స్టేజీ వద్ద మరిపెడ బంగ్లా నుంచిఖమ్మం వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: మండలాల్లోని పలు గ్రామాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈనేపథ్యాన నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో పాదిల పాపారావు భార్య పార్వతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మృతురాలి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంసభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ముస్తాఫా, శివ, బోడా శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం మాజీ సర్పంచ్ బోడపట్ల నర్సయ్య కుమార్తె వివాహం జరగనుండగా.. ఆమెను ఆశీర్వదించి పట్టు వస్త్రాలు అందజేశారు. బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ మాజీ ఎంపీపీలు మంగీలాల్, అశోక్, మాజీ సర్పంచ్ బోడపట్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	లైలా
ఆదిత్య	బ్రహ్మా ఆనందం
శ్రీనివాస	చావా, బాపు
సినీగెలాక్సీ	రామం, రాఘవం

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	48	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	54	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	58	తోటకూర	3
దొండ	34		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		40
చామగడ్డ	54	పుదీన	1
క్యారెట్	34		25
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

నిర్లక్ష్యపు నీడలో నర్సరీలు..



షేడ్‌నెట్ లేని కొత్తకొత్తూరు నర్సరీ

ప్రశ్నార్థకంగా మొక్కల ఎదుగుదల
- ఎండతీవ్రతతో ఎండుతున్న మొక్కలు
- షేడ్ నెట్‌లు ఏర్పాటులో జాప్యం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

నేలకొండపల్లి: రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఏటా వన మహోత్సవం కార్యక్రమం పేరిట మొక్కలు నాటుతూ వస్తోంది. దీని కోసం అవసరమైన మొక్కలను పెంచేందుకు ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసింది. కాగా, ఈఏడాది మొదట్లోనే ఎండ తీవ్రత దంచికొడుతుండడంతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోతున్నాయి. కొత్తగా నాటిన మొక్కలకు ఎదుగుదల లేకుండాపోతోంది. నర్సరీలకు నీడను ఇచ్చే షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వడబడుతున్న మొక్కలు..

ఈ సీజన్‌లో ఫిబ్రవరిలోనే ఎండ తీవ్రత పెరగడంతో మొక్కల పెంపకంపై మరింత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈవిషయమై రానున్న వేసవిలో ఆయా పంచాయతీల్లో నిర్వహిస్తున్న నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించకపోతే ఈఏడాది మొక్కలు అందించే పరిస్థితి లేదు. ఇలా చాలా మండలాల్లోని నర్సరీల్లో మొక్కలు వడబడుతున్నాయి. దీంతో మున్ముందు నర్సరీల నిర్వహణ మరింత కష్టంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

నూరుశాతం పెరిగేలా చర్యలు



ప్రతీ నర్సరీలో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని ఆయా మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతీ పంచాయతీలో నర్సరీల ద్వారా మొక్కలు పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చూస్తున్నాం. నూరు శాతం ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటాం.

– సన్యాసయ్య, డీఆర్‌డీఓ

ప్రతీ పంచాయతీలో నర్సరీ..



తిరుమలాపురం నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

తెలంగాణ ప్రభుత్వం మొక్కల పెంపకం కోసం ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతీ పంచాయతీలో దాదాపు 6 వేల మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నర్సరీలు నిర్లక్ష్యపు నీడలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్సరీలకు నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదగడం లేదు. ఎండకు కొన్ని ఎండిపోతుంటే మరికొన్ని మొలకలు కూడా రాలేదు. నీటితడులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటే తప్ప.. మొక్కలు చేతికొచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

గ్రానైట్ పరిశ్రమలను కాపాడాలి



సీఎం, మంత్రులను కలిసిన అసోసియేషన్ నేతలు

ఖమ్మంఅర్బన్: రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమలను కాపాడాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర, జిల్లా గ్రానైట్ అసోసియేషన్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, నరేందర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, క్వారీల లీజులు సులభతరం చేయడం, తదితర వాటిపై వివరించినట్లు ది ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ తెలిపారు. దీనిపై రెండు రోజుల్లో క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు, విత్తన గిడ్డంగి చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సాదు రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తీర్థాల జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ నర్సింహారావు

ఖమ్మంరూరల్: ఈనెల 26న మండలంలో జరిగే తీర్థాల జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్‌డీఓ నర్సింహారావు అన్నారు. గురువారం జాతర ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మెలగాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఆర్‌టీసీ అధికారులు బస్సులను వేళకు నడిపించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, భక్తుల స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను ఉంచాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23న హనుమాన్ చాలీసా పారాయణం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: లోక కల్యాణార్థం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఈ నెల 23న శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనేపథ్యాన గురువారం గాంధీచౌక్ షిర్డీ సాయి మందిరంలో శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ప్రతినిధివర్గం పారాయణంపై రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించి, కార్యక్రమాలను వెల్లడించారు. ఆధ్యాత్మిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వేములపల్లి వెంకటేశ్వరరావు, గన్నవరపు నాగేశ్వరరావు, డైరెక్టర్ లగడపాటి రామారావులు మాట్లాడుతూ.. 3 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తుండగా.. భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కామేపల్లి: మేజర్లు అయిన ప్రేమికులిద్దరు కామేపల్లి పోలీసులను గురువారం ఆశ్రయించారు. మండలంలోని నెమలిపురికి చెందిన ఓ యువతి, అవినాష్ ఏడాదిన్నరగా ప్రేమించుకుంటున్నారు. కాగా, యువతి ఈనెల 19న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీంతో ఆమె అవినాష్‌తో కలిసి పోలీసుస్టేషన్‌కు వచ్చి తాము మేజర్లు అయినందున ఇష్టపకారం పెళ్లి చేసుకుంటామని తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ సాయికుమార్ ఇద్దరి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పూర్వపు డొంక రహదారి పునరుద్ధరణ



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 51, 52లకు మధ్యలో సత్య సంకల్ప వెంచర్‌లో కబ్జాకు గురైన పూర్వపు డొంకను గురువారం రెవెన్యూ అధికారులు సర్వే చేసి దారిని పునరుద్ధరించారు. సుమారు 10 కుంటల భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు తేల్చి ఆ భూమిని స్వాధీనం చేసుకుని డొంకను తిరిగి ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. గతంలో ఇదే విషయమై రైతులు సంబంధిత సర్వేయర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.

జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం



స్వేరోస్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: జ్ఞానసమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ పనిచేయాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిన వీరయ్య అన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మొండితోక ఈదయ్య, కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా తగరం శ్రీకాంత్, మహేష్, గోవిందరాజు, కోశాధికారిగా రమణ, అధికార ప్రతినిధిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు సుధాకర్, వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మాధవి, కిరణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నరసింహారావు, కృష్ణయ్య, మల్సూర్ తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు

నేలకొండపల్లి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యాన గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రెహానా సుల్తానా మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి 22 వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలు, మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పుల్లారావు, డాక్టర్ అమూల్య, ఏఎన్‌ఎంలు సుజాత, సరిత, ఫార్మసిస్ట్ రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో వైద్యులు, విద్యార్థినులు

అల్పాహారం పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాకబండబజార్‌లో మోతుకూరి చంద్రకళా రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం అల్పాహారం పంపిణీ చేశారు. ప్రణీత నిలయంలో ట్రస్ట్ చైర్మన్ మోతుకూరి చంద్రకళ మాట్లాడుతూ.. పేదలకు సేవా కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశంతో ట్రస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జెల ఓదెలు, చిట్టిబాబు, శ్రీనివాస్, మహేష్, ఉష, షబానా, మానస, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బిహార్ వాసి..



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతి స్థిమితం లేని ఓ బిహార్‌వాసిని అన్నం సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆయన కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 21న అర్ధరాత్రి నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని 25ఏళ్ల యువకుడు స్థానికులపై దాడులు చేస్తున్నాడు. దీంతో డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు వచ్చి మతిస్థిమితం లేని యువకుడిని తీసుకెళ్లి అన్నం ఫౌండేషన్‌లో అప్పగించారు. కొన్ని రోజులు తర్వాత అతడు తమది బిహార్ రాష్ట్రం ముజఫర్పూర్ జిల్లా లతావర బృందావన గ్రామం అని, తన పేరు ముఖేష్‌కుమార్‌గా చెప్పడంతో అక్కడ పోలీసుల ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు తెలిపారు. తండ్రి షర్టు దాస్, సోదరుడు రావడంతో గురువారం ఖమ్మంలోని ఖమ్మం డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి కేవీ చంద్రశేఖరరావు సమక్షంలో అప్పగించినట్లు తెలిపారు.

యువత మత్తుకు బానిస కావొద్దు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐలు, తదితరులు

రఘునాథపాలెం: యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, మాదకద్రవ్యాల దుర్వినియోగం లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని నార్కోటిక్స్ సీఐ వి.విజయరాంకుమార్, రఘునాథపాలెం సీఐ మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ యువతకు పిలుపునిచ్చారు. గురువారం రఘునాథపాలెంలోని బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్‌ఐఎస్‌డీ), ఖమ్మం నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్‌ఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. భారత్‌లో డ్రగ్స్ వినియోగం పెద్ద సమస్యగా మారిందని, ఇది వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ఈ మధ్యకాలంలో యువత క్షణికానందం కోసం చేసే దురాలవాట్లు, వికృత చేష్టలపై పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తమ చుట్టుపక్కల మాదకద్రవ్యాలు సేవిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1908కి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి కార్యక్రమంలో పాల్గొన్న యువతతో మత్తు పదార్థాలు వాడమని అధికారులు ప్రతిజ్ఞ చేయిచారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ఖమ్మంరూరల్: పెదతండా పరిధిలోని పలు వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా తెలిపారు. గురువారం మండలంలోని పెదతండాలో కమిషనర్ పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే వేసవిలో మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంతో పాటు ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జీవనభృతి వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న తిమ్మిడి హన్మంతరావు

తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: వ్యవసాయ కూలీలకు జీవనభృతిగా ప్రకటించిన రూ.12 వేలు వెంటనే చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తానని చెప్పి అనేక షరతులు విధిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి రెంటాల యాదగిరి, నాయకులు సోమనపల్లి వెంకటేశ్వర్లు, సుంచు వెంకన్న, చిర్రా భిక్షం, రాయబారపు యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు వేగవంతం చేయండి



పంటల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

కూసుమంచి: వ్యవసాయశాఖ ఆధ్వర్యాన చేపట్టిన డిజిటల్ పంటల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కూసుమంచి ఏడీఏ సరిత సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో చేపట్టిన పంటల నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి విడత కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పంటల వివరాలన్ని సమగ్రంగా నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. అనంతరం పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సాగులోని లాభాలను, దిగుబడులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవిందర్, రైతులు పాల్గొన్నారు

'యుద్ధభేరి' పోస్టర్ల ఆవిష్కరణ..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం భరోసా ఇవ్వలేని ఏకీకృత పెన్షన్ విధానాన్ని (యూపీఎస్) వ్యతిరేకిస్తూ మార్చి 2న ధర్నా చౌక్ కేంద్రంగా నిర్వహించే యుద్ధభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సీపీఎస్ఈయూ) జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శిధర్ కోరారు. గురువారం ఖమ్మం నగరంతో పాటు పలు ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలో యుద్ధభేరి పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించడం మినహా మరే ఇతర విధానాలు ఉద్యోగి హక్కులను కాపాడలేవని, సామాజిక భద్రతను కల్పించలేవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగి సురేష్, గుగులోత్ మోహన్, కమటం నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ, 5వ డివిజన్ల పరిధిలోని యూపీహెచ్ కాలనీలో గురువారం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన నాయకుడు బానోత్ కిషన్‌నాయక్ ఆధ్వర్యాన గిరిజన(లంబాడీ) సంప్రదాయ దుస్తులు ధరించి, ఆటాపాటలతో సందడి చేశారు. సేవాలాల్ మహరాజ్ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన భారతి చంద్రం, లింగాల రవికుమార్, కోలేటి రాధాకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ నేతలు

ఖమ్మంగాంధీచౌక్: అనారోగ్యంతో బాధపడుతున్న ఫొటోగ్రాఫర్ కోలా రామారావుకు జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ అండగా నిలిచింది. వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం ఖమ్మంలో అసోసియేషన్ ఆధ్వర్యాన రామారావుకు రూ.43 వేల ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, నిరుడు తిరపతిరావు, కమటం రఘు, కేఎస్ బాబా, రంజిత్, లాస్య, అంజి, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామానికి చెందిన జెన్నీ ఇటీవల మృతిచెందగా.. గురువారం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు, చిమ్మపూడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణ చేశారు. మానవతాదృక్పదంతో తన వంతు సాయంగా అందించినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్నీ కుటుంబ సభ్యులు, గ్రామ మాజీ వార్డు సభ్యులు మద్దుల నాగేశ్వరరావు, కాలింగి వీరబాబులతో పాటు సచ్చు వీరబాబు, రహిమాన్, గుండ్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ గెలుపుతో రాజ్యాధికారం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపును కాంక్షిస్తూ ఖమ్మం మున్నూరు కాపు హాస్టల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావుపటేల్ మాట్లాడుతూ.. బహుజన కులాల ఐక్యత రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని, ఆదిశగా పూల రవీందర్ గెలుపుతో అడుగు పడాలని అన్నారు. అనంతరం హిందూ, బీసీ, మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ మాట్లాడారు. ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పర్వత సతీష్ పటేల్, పరికిపండ్ల అశోక్, మేకల భిక్షమయ్య, పాల్వంచ రామారావు, పొన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎస్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957